క్లుప్తంగా

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రవచనం చెబుతున్న రఘునందన్ సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు.ఇస్కాన్‌సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం



తాగునీటి ప్యాకెట్లు అందిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: సూర్య నారాయణ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం గుత్తి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ట్రస్ట్ సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఉచిత మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, డాక్టర్ కృష్ణమోహన్, భీమిశెట్టి ప్రకాష్, శ్రీదేవి, డాక్టర్ నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కూటమిని ఓడించండి



ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): బీజేపీ, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన అభ్యర్థులను ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం నాయకులు మహ్మద్ షరీఫ్, పార్వతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఒకటో వార్డులో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి.గౌస్‌దేశాయ్‌కు మద్దతుగా ఒకటో వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే 11వ వార్డులో పార్టీ జోన్ బాధ్యుడు పి.గోవిందు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అధికార పార్టీ నిరంకుశంగా పాలన చేస్తోందన్నారు. నిత్యవసర ధరలను విపరీతంగా పెంచిన బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండి యా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కుమారస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్ఠిని పరస్కరించుకుని లోకకల్యాణార్థం ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అందరికీ ఆరోగ్య సిరి

- ఆరోగ్యశ్రీ పథకంతో నిలబడుతున్న ప్రాణాలు
- జిల్లాలో 124 నెట్‌వర్క్ ఆసుపత్రులు
- 6,49,493 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు
- 3,257 వ్యాధులకు చికిత్స
- గత ఐదేళ్లలో 2,89,125 మందికి ఆరోగ్యశ్రీలో చికిత్స
- రూ.586.5కోట్ల మొత్తం క్లెయిమ్

రెక్కాడితే గానీ డొక్కాడని పేదవాడికి పెద్ద జబ్బు చేస్తే ఇక చావే శరణ్యం అనుకునే రోజులు పోయాయి. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం సరిగా అమలు కాక ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెద్ద జబ్బులకు వైద్యం అందక అవస్థలు పడిన పేదలకు ఇప్పుడు వైఎస్ జగన్ సర్కారు సంపూర్ణ ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. దివంగత వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని పూర్వవైభవం తీసుకురావడంతో పాటు మరింత మెరుగ్గా తీర్చిదిద్దడంతో జిల్లాలో ప్రతి ఏటా కొన్ని వేల మంది ఉచితంగా వైద్య సేవలు పొందుతూ ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నారు. దీంతో డబ్బు లేని కారణంగా ఏ ఒక్కరూ అనారోగ్యంతో మరణించకూడదన్న వైఎస్ఆర్ లక్ష్యం నెరవేరుతోంది.

కర్నూలు(హాస్పిటల్): 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు కార్పొరేట్ హాస్పిటల్ అంటే ఏమిటో కూడా తెలియని పేద వారు సైతం ప్రైవేటు ఆసుపత్రి భవనం మెట్టు తొక్కడమే గాకుండా ఆరోగ్యశ్రీ కార్డు జేబులో పెట్టుకుని దర్జాగా అక్కడ చికిత్స అందుకుంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. పథకాన్ని పూర్తిగా తీసేసే సాహసం కూడా చేశారు. పథకం అమలులో పలు రకాల ఆంక్షలు పెడుతూ పేదలకు క్రమంగా దూరం చేసే ప్రయత్నం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ వివరాలు

సంవత్సరం	నిర్వహించిన చికిత్సలు	క్లెయిమ్ అయిన మొత్తం రూ.కోట్లలో	ఆసరా లబ్ధిదారులు	క్లెయిమ్ అయిన మొత్తం రూ.కోట్లలో
2019-20	35,819	78.21	8,527	4.59
2020-21	42,325	99.66	33,489	17.05
2021-22	53,459	106.05	45,705	25.1
2022-23	60,361	119.13	45,518	25.02
2023-24	97,161	183.45	73,303	40.91
మొత్తం	2,89,125	586.5	2,06,542	112.67

ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తీసుకురావడమే గాక మరింత గొప్పగా తీర్చిద్దారు. ఐదేళ్ల క్రితం కేవలం 1800లోపు ఉన్న చికిత్సలను ఇప్పుడు 3,257కు పెంచారు. అంతేగాక ఇతర రాష్ట్రాల వారు ఎవ్వరైనా ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురైతే వారికి ఏ ఆసుపత్రిలోనైనా ఉచితంగా చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు.



పెద్దాసుపత్రిలోని నెఫ్రాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ఐదేళ్లలో 2.89లక్షల మందికి చికిత్స

జిల్లాలో ప్రస్తుతం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులు 124 ఉన్నాయి. ఇందులో 42 ప్రభుత్వ, 53 ప్రైవేటు, 29 డెంటల్ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు గాను ఒక డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, ఒక డిస్ట్రిక్ట్ మేనేజర్, ఏడుగురు నెట్‌వర్క్ టీమ్ లీడర్లు, ఇద్దరు ఆఫీస్ అసోసియేట్స్, 175 మంది ఆరోగ్యమిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో 2,89,125 మంది చికిత్స తీసుకోగా రూ.586.5కోట్లను ఆసుపత్రులు క్లెయిమ్ చేసుకున్నాయి. అంతేగాక ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారికి ఆర్థిక భరోసా కోసం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 2,06,542 మంది లబ్ధిపొందగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.112.67కోట్లు జమ అయ్యాయి.



ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ కీయోస్క్

కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం



డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందుకోవచ్చు. జేబులో కార్డు ఉంటే చాలు ఎంత పెద్ద ఆసుపత్రికైనా వెళ్లి ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చు. ఈ పథకం కారణంగా చాలా మంది పేదలు ఉచితంగా చికిత్స అందుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. ఏ ఆసుపత్రిలోనైనా సమస్యలు ఉంటే నేరుగా మా కార్యాలయంలో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. –డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది



మాది చాలా పేద కుటుంబం. నాకు ఇటీవల కడుపునొప్పి తీవ్రంగా వచ్చింది. దీంతో మా కుటుంబసభ్యులు కర్నూలులోని అమీలియో హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. అక్కడి వైద్యులు పరీక్ష చేసి అపెండిక్స్ ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే వారు ఆపరేషన్ చేయడంతో నా సమస్య తీరిపోయింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నాకు ఆరోగ్యశ్రీ ఆసరా పేరుపై రూ. 2వేలను నా బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆదుకున్నారు. సీఎం జగన్ అన్న రుణం జన్మలో తీర్చుకోలేనిది. –ధరణి, కర్నూలు

ఆరోగ్యశ్రీ లేకపోతే మాలాంటి వారికి కష్టం



నేను గతంలో ఓ మిల్లులో పనిచేసేవాన్ని. వయస్సు మీద పడటంతో ఇప్పుడు ఇంటి వద్దే ఉంటున్నాను. ఇటీవల అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రికి వెళ్లాను. అక్కడి వైద్యులు పరీక్షించి గుండెలో సమస్య ఉందని చెప్పి అందుకు తగిన పరీక్షలు చేయగా ఒక వాల్వ్ బ్లాక్ ఉందని చెప్పారు. వెంటనే వారు ఈ నెల 10వ తేదీన నాకు స్టంట్ చేశారు. 13వ తేదీన డిశ్చార్జ్ అయ్యాను. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగుంది. ఇలాంటి పథకం లేకపోతే నా లాంటి వారికి ఎంతో కష్టంగా ఉండేది. –కె. హనుమంతప్ప, ఆదోని

బాబుకు పింఛన్‌దారుల ఉసురు తప్పదు

- వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పెన్షన్ పంపిణీని అడ్డుకోవడం విచారకరం
- ఉత్తర్వులపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి
- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి



ఇందిరాగాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు (టౌన్) : వలంటీర్ల ద్వారా సామాజిక పెన్షన్ పంపిణీని అడ్డుకున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు పెన్షన్‌దారుల ఉసురు తగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక నరసింగరావు పేటలోని ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తున్నారన్నారు. దీని వల్ల అవ్వాతాతలకు, దివ్యాంగులకు వ్యయప్రయాసలు ఉండేవి కాదన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు నిర్వాకంతో ఇంటి వద్ద పెన్షన్ల పంపిణీకి బ్రేక్ పడిందన్నారు. సచివాలయాల వద్ద తీసుకోవాలంటే పెన్షన్‌దారులకు ఇబ్బంది అవుతుందని, ఇదివరకులాగా సకాలంలో చేతికి పెన్షన్ అందదు అన్నారు. చంద్రబాబు ఆది నుంచి వలంటీర్ల మీద అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. అందులో భాగంగానే వారి సేవలను అడ్డుకుంటున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల తీరు వల్ల గత రెండు నెలలుగా పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారంతా బాబుకు ఓటుతో గుణపాఠం చెబుతారన్నారు. రంజాన్ , ఈస్టర్ పండుగల సమయంలో ప్రతి పక్షాలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ఫిర్యాదుతో వలంటీర్ల సేవలను నిలిపివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై ఎన్నికల కమిషన్ పునరాలోచన చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి

ఐదేళ్లుగా ఇంటింటికీ సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఆదివారం రాత్రి కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి స్థానిక 43 వ వార్డు ఇందిరాగాంధీనగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయాల జిల్లా కన్వీనర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మునెమ్మ, స్థానిక వార్డు ఇన్‌చార్జ్ నాయకులు మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లో వచ్చానన్నారు. సమస్యలపై సుదీర్ఘ అనుభవం ఉన్న తనకు అవకాశం ఇస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డ కర్నూలు అని, ప్రజలు ప్రతి ఎన్నికల్లో ఆశీర్వదిస్తున్నారన్నారు. జగనన్న ఒక మంచి వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దింపారని, గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో కొత్త ఓటరుగా నమోదు చేసుకునే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అర్హత ఉన్న వారు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకురావాలని తెలిపారు. ఓటు ఉండి తొలగించబడిన వారు సైతం కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కూలీల అడ్డాలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ ఖాజా డిమాండ్ చేశారు. ఆదివారం సుర్జీత్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి కూలీలకు అడ్డాల్లో మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాక చలి పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ మూస, సయ్యద్, బాబు,జావీదు, అర్షద్‌బాష పాల్గొన్నారు.

పొలిటికల్ జేఏసీ నుంచి వైదొలుగుతున్నాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సీట్ల విషయంలో ఏర్పాటైన కురువ సంఘాల ఐక్యవేదిక (పొలిటికల్ జేఏసీ)నుంచి వైదొలగుతున్నట్లు జిల్లా కురువ సంఘం నేతలు ప్రకటించారు. ఆదివారం జరిగిన సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ తొాడు శ్రీనివాసులు మాట్లాడు తూ సీట్ల కేటాయింపు పూర్తి అయినందున జేఏసీ నుంచి కురువ సంఘం వైదొలుగుతోందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, సహాయ కార్యదర్శి కొత్తపల్లి దేవేంద్ర, పుల్లన్న, బీచుపల్లి, హరిదాసు, బీసీ తిరుపాలు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీ పదవీ విరమణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ఆదివారం పదవీ విరమణ చేశారు. సాయంత్రం 5 గంటలకు కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్న బాబుకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. పదవీ విరమణ కారణంగా జేడీ పోస్టు ఖాళీ అవుతుండటంతో ఇది వరకే రెగ్యులర్ జేడీని ప్రభుత్వం నియమించింది. మండపేట శిక్షణ కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ జి.శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి జేడీగా నియమించారు. ఈయన ఈనెల 3వ తేదీ పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నిస్వార్థ దేశభక్తుడు గామాగో



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: గామాగో నిస్వార్థ దేశభక్తుడు అని వక్తలు కొనియాడారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గామాగో ఆత్మకథ 'విస్మృత కార్యకర్త' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సీపీఐ నాయకులు రామాంజనేయులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో గామాగో ఆత్మకథకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. బనగానపల్లె సంస్థాన స్వాతంత్ర్య పోరాటాన్ని ఇనాం భూముల రద్దు కోసం జరిగిన కరివేన సత్యాగ్రహాన్ని వివరంగా మొదటి సారి రికార్డు చేసిన పుస్తకం గామాగో ఆత్మకథ పుస్తకమన్నారు. గామాగో వ్యక్తిత్వం, ఆలోచన, నిజాయితీ, ఆచరణలో నిబద్ధత, ఉద్యమం ఎలా నడపాలో తదితర విషయాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం జేఎస్‌ఆర్కే శర్మ, సాహితీ వేత్త జి.ఉమామహేశ్వర్‌లు పుస్తక సమీక్ష చేస్తూ రాజకీయ పాఠశాలలు నడపడం, అక్కడ తయారైన కార్యకర్తలను అత్యంత క్రియాశీలకంగా ప్రజా ఉద్యమాలు, సత్యాగ్రహాల్లో పాల్గొనేలా చేయడం గామాగో కార్యనిర్వహణ దీక్షకు అద్దం పడతాయన్నారు. గామాగో దేశానికి చేసిన సేవకు గౌరవంతో, అభిమానంతో ఆయన కుమార్తె ముక్కమల్ల ధరిత్రీదేవిని ఘనంగా సన్మానించారు. రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు, కవులు రాయపాటి శ్రీనివాస్, జంధ్యాల రఘుబాబు, పుల్లా రామాంజనేయులు, డాక్టర్ దండబోయిన పార్వతీదేవి, నాగమణి, కల్యాణ దుర్గం స్వర్ణలత, సంగం స్వయంప్రభ, డాక్టర్ చంద్రమౌళిని, హరిసింహానాయుడు, డాక్టర్ చిన్నావుల రాజారెడ్డి, గోరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పాణ్యం నాగార్జున, గద్దం అమరనాథ రెడ్డి, అరసం సభ్యులు రాణి లీలావతి, ప్రమోద్‌చక్రవర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్, రాజా రమేష్, రేవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



హోసన్న మందిరంలో దైవ సందేశం ఇస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువపై ఆసువులు బాసిన యేసుక్రీస్తు సమాధి కాబడి మూడో రోజు తిరిగి లేచాడన్న విశ్వాసంతో ఈ పండుగను నిర్వహించారు. తెల్లవారు జామునే ఆయా చర్చి సంఘాలకు చెందిన మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్లు ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాపిస్టు చర్చి పాస్టర్లు రెవరెండ్ అనిల్ కుమార్, సి. క్యాంపు ప్రార్థన మందిరానికి దైవ సందేశం ఇచ్చేందుకు వచ్చిన పాస్టర్ ఆర్.పి. సజీవన్, చర్చి పాస్టర్ రెవరెండ్ గంటా కరుణా సాగర్, హోసన్న మందిరం పాస్టర్ ఫ్రెడీపాల్ ఆయా చర్చిల్లో ప్రత్యేక దైవ సందేశం ఇచ్చారు. యేసుక్రీస్తు బోధించిన మాటలను విశ్వసించి సన్మార్గంలో నడువాలన్నారు. అలాగే పునరుత్థానుడైన క్రీస్తు గురించి బైబిల్ బోధనలు చేశారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మహిళలు, పురుషులు, యువతీయువకులు క్రీస్తును లోకరక్షకుడిగా స్వీకరిస్తూ బాప్తిజం తీసుకొని ప్రభుబల్లలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



ఫ్యానుగుర్తుకు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

- ఓటుతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 34వ వార్డులోని కృష్ణారెడ్డి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలను ఇంటి ముంగింటకే తెచ్చామన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఇంటి సమీపంలోనే సమస్యలకు పరిష్కారం చూపాలని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు.

రెట్టింపు సంక్షేమం

త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల చేస్తారని, అందులో రెట్టింపు సంక్షేమానికి ప్రణాళిక చేశారని ఎమ్మెల్యే అన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలసి ఉమ్మడిగా 600పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. మళ్లీ మోసపోకుండా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

కల్లూరు అర్బన్‌లోని పందిపాడు, ముజఫర్‌నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ ప్రాంతాలకు చెందిన టీడీపీ-70, జనసేన-50, బీజేపీ-30 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 32వ వార్డుకు చెందిన బీజేపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, భవాని, షేక్షావలి, భాస్కర్, జహంగీర్, పరుశరామ్, రియాజ్, శ్రీను, వాలి, చక్రి, గోపాల్, మున్నాతో పాటు మొత్తంగా 150 కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణా యాదవ్, ఆది నారాయణరెడ్డి, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై కక్ష కట్టిన చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లపై కక్షకట్టారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌దారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. ప్రతి నెలా వారు గ్రామాల్లోని అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు పింఛన్ అందజేసేవారన్నారు. అయితే, చంద్రబాబు ఈసీకి తన అనుయాయులతో ఫిర్యాదు చేయించి వలంటీర్లతో పెన్షన్ పంపిణీని అడ్డుకున్నారన్నారు. బాబు తీరుతో సకాంలో పింఛన్ అందక వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. పేదలంటే బాబుకు చులకన అని, రెండురోజుల క్రితం టిప్పర్ డ్రైవర్‌కు అసెంబ్లీ సీటు ఎందుకని అవహేళనగా మాట్లాడారని చెప్పారు. సమావేశంలో డీఏపీబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టీయూసి భీమేష్‌రెడ్డి, నాయకులు వీరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్ వెంటే జనం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్

కర్నూలు (టౌన్) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, ఇందుకు జిల్లాలో మేమంతా సిద్ధం బస్సు యాత్రకు లభించిన విశేష స్పందనే ఓ ఉదాహరణ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోసు అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిద్ధం బస్సు యాత్రకు లభిస్తున్న ప్రజా స్పందన చూస్తుంటే తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమికి ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఐదేళ్ల పాటు ప్రజా సంక్షేమ పాలన అందించిన జగన్ననకు గత ఎన్నికల మాదిరిగానే ఈసారి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు 2 పార్లమెంటు స్థానాలను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాడన్నారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు.

బాబుకు... పెన్షనర్ల శాపం తగులుతుంది

ప్రతినెలా 1 వ తేదీన పెన్షన్ అందుకునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు చంద్రబాబు నిర్వాకంతో ఈసారి సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని సుభాష్ అన్నారు. పెన్షన్‌దారుల శాపం చంద్రబాబుకు తప్పదన్నారు. పేదలంటే చంద్రబాబుకు ఎందుకో అంత కోపం అన్నారు. రెండు మూడు నెలలు నుంచి పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా ఆయన కుట్రలు పన్నుతున్నారన్నారు. ఇప్పుడు వలంటీర్లతో పెన్షన్ పంపిణీ జరగకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారన్నారు.

బాబూ..పేదలంటే ఎందుకంత వివక్ష?



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కర్నూలు (సిటీ) : నిరుపేదలంటే అంత అసహనమా.. వారి పట్ల ఎందుకంత వివక్ష చూపుతున్నారని కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ టీడీపీ అధినేత చంద్రబాబుపై మండిపడ్డారు. శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును చంద్రబాబు నాయుడు అవహేళనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

వలంటీర్ వ్యవస్థపై కుట్రలు..

వలంటీర్ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేయడాన్ని ఇతర రాష్ట్రాలు అభినందిస్తుంటే చంద్రబాబు నాయుడు అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. ' మీరు ఏరోజైనా పేదల కోసం పని చేశారా? మీ పాలనంతా పెత్తందారుల మేలు కోసమే శ్రమించారు. అందుకే మిమ్మల్ని గత ఎన్నికల్లో ప్రజలు దూరం పెట్టారు. అయినా మీ తీరు మారలేదు. నిరుపేదలకు సకాలంలో పింఛన్లు ఇవ్వనీయకుండా వలంటీర్లను దూరం పెట్టించారా'ని కోట్లహర్ష, సతీష్ మండిపడ్డారు. టీడీపీ హయాంలో మాదిరిగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులను పింఛన్ కోసం కార్యాలయాల చుట్టు తిప్పేందుకే బాబు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, ప్రసన్నకుమార్, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్‌సింహారెడ్డి, పోలకల్లు ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ప్రసాదు, రేమట సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : జాతీయ స్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఆ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ప్రకటించారు. ఎంపికయిన పురుషుల జట్టులో భాస్కర్, సాధిక్, నదీమ్, సురేష్, వెంకటేష్, అక్షయ్, మాబు వలీ, తేజ, ధర్మారావు, సుమంత్ రెడ్డి, చిన్ని బాబు, గణేష్, శివరామకృష్ణ, సతీష్, వీరాంజనేయులు ఉన్నారు. బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆయన పిలుపు నిచ్చారు.